నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2020'లో ప్రచురణకు ఎంపికైన కథ.

రుణం

... డాక్టర్ సిద్దెంకి యాదగిరి
94412 44773



సూదులు పోకస్ దీపాలోలే ఆటోను తకాంచి తకాంచి సూత్తున్నయి.

మనిషిని మనిషి సూస్తేనే ఎగ్రిలేసే కాలం. మిన్నిరిగి మీదవడ్డట్టు లాక్‌డౌన్‌తోటి పబ్లిక్ లాక్కోలేక పీక్కోలేక తండ్లాడు తుండ్రు. సినిమాలు, కల్లు దుకాణాలు, వైన్‌షాపులు.. సకులం బందు. బతుకు బండకింద చెయ్యిరికినట్లు.. కొనవోతే కొరివి అమ్మవోతే అడివిలా తయారైంది.

అది కుక్కమూతి ఆటో. డ్రైవర్‌తో ముగ్గు రున్నరు. వెనుక సీట్లో మనుషుల్లాంటి పాతబట్టల ముల్లెలు రెండున్నయి. కదులని ముల్లెలాగ ఓ మనిషి. పీనుగు తీర్గయి, క్యాలిలేని ఆ మనిషిని తూట్లువడ్డ బొంత పురాగ కప్పుతలేదు. గాలిని చీల్చుతూ దూసుకెల్లే ఆటో రువ్వడికి బొంత సగం కోసిన యాటలా కొట్టుకాడుతంది.

చెవులు కోసిన కుక్కలెక్క ఆటో ఊళ్లె అడుగు వెట్టింది. ఇచ్చంత్రాల ఊరు ఉట్టిగుంటదా? పొద్దుదిరుగుడు సేన్ల రామసిల్కలు చేరినట్లు, జనమంతా మూతులకు గుడ్డలు కట్టుకొని చౌర స్తాల గుమిగూడింగ్రు. జెండ సుట్టూ జెమ్మటాలు గొడ్తంగ్రు. "ఏ ఊరు ఆటో? ఎటు వోతంది? ఆటోల ఎవలు? ఇటెందుకు వొస్తంగ్రు?" అని ప్రశ్నించుకుంటూ, రెప్పకొట్టని సూపుల తకాంచి తకాంచి సూత్తున్నయి.

ఏనుగులు వోతుంటే ఎన్ని కుక్కలు మొరుగ యన్నట్లు గవ్వేం పట్టించుకోకుంట ఆటో పోతనే ఉంది. ఆటోను సూసిన మనుషులు బెజ్జంకి తీర్తంల మంద బెదిరిన్నట్లే బెదురుతుంగ్రు. కుట కుట కుట అనుకుంట ఉప్పునీళ్ల బాయికాడ ఆగి, ఎండలోల్ల ఇండ్లదిక్కు తిరిగింది. వాడకట్టులో కొమ్మలు కొట్టేసిన చెట్టులా, పాతగోడలు మొండి గా నిలుసున్నై. మూడొంతుల కూలిన ఇల్లు. దయ్యమోలే మొలిచిన చీడుల ఆటో, ఆ ఇంటి ముంగట ఆగింది. కన్నుమూసి తెరిసే వరకు కాని పని దప్పుసాటింపు చేసినట్లు సాకలివాడకు, ఊళ్లె గ్గాడ దప్పు సాటిచ్చినట్లు ఎర్కయింది. బొడ్డూ డని పిల్లకాన్నుంచి సూసెతందుకు కదిలొచ్చింగ్రు. రాల్లగోడ పేర్చినట్లు కటారకట్టి సూత్తంగ్రు.

దగ్గు, దమ్ము, జరంతో క్యాలి దప్పింది మడేల్. ఎనుకట ఊళ్లెకెల్లి ఎళ్లిపోయినపుడు ఎత్తూ, పొడు గూ నల్లటి మనిషి. నల్గురినైన ఎదుర్కొనే బలమున్నో దున్నోడు. ఇప్పుడు ఎన్ని బొక్కలున్నయో లెక్కవె ట్టేట్లున్న బొక్కలగూడుకు అతుక్కపోయిన తోలు. చీకేసిన మాడిపండులెక్క దివాలదీసిండు. ఆటో లో వొచ్చినోళ్లు తల్కాయె ఒకలు, కాల్లు ఒకలు వట్టి దించుతుంటే, తెల్లటి గడ్డం ఎండి దారాల్లా మెరుత్తంది. ఆ మనిషిని ఎవలూ గుర్తించలే.


"ఈ మనిషెవలు?" అనుకుంట గుసగుసలు మాత్రం వెట్టుకుంటంగ్రు.

''ఈయెన మడేల్. కడింటి మైసయ్య అన్న కొడుకు మనోడే గాదు''.. ఆఖరికి సాకలి పెద్దెల్లవ్వ పశ్నత్పట్టి చెప్పె.

''ఎవలు?'' అని తీవ్రస్వరంతో ఒక ఆడగొంతు ధైర్యంగా ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించింది.

''ఈయెన సాకలి మడేల్. ఈ ఊరేనట. మా గల్లీల డబ్బు వెట్టుకున్నడు. ముప్పై ఏండ్లుగా మా బట్టలు పిండి, ఇస్త్రీ జేసిండు. వొచ్చిన పైసలు ఉన్నంతల దానధర్మం చేసిండు. మనిషి సాకలి. మనసు పూజారి'' అని డ్రైవర్ చెప్పుతుండు.

''పూజారైతే నడింట్ల వెట్టుకోపోయినవ్?



ఎందుకు దించుతున్నవ్'' అని దబాయించింది.

''ఇగ బాగా దగ్గు, సడిది, జరమొచ్చింది. జర్ర మాట్లాడుతున్నప్పుడు అడిగితే.. 'నా పాణం ఎటో అయితంది. నన్ను మా ఊరికి తీసుకపోండ్రి. నేను అక్కన్నే సత్త' అని ఒక్కతీరుగ బతిలాడిండు. ఇప్పుడు గూడ కలవరిత్తండు. మా నాసర్‌పుర గల్లీ వాల్లందరం మనిషిన్ని ఏసుకొని ఈ ఆటోల ఇక్కడికి తెచ్చినం'' అని చెప్పుతండు డ్రైవర్‌తో వొచ్చినతను. మాట్లాడేది మాట్లాడుతుండంగా.. డ్రైవర్ ఆ ముల్లెలను ఆటోలోంచి దించిండు.

''సచ్చెటోన్ని సావనియ్యక ఇక్కడికెందుకు తెచ్చిండ్రు? ఎవ్వల్ల సంపుతమనుకుంటుండ్రు? ఎవడు తెమ్మన్నడు? ఎందుకు తెచ్చిండ్రు? మనిషిగాలి మనిషికి పడని కాలం. కసాయి కరోనా కాలం. మా వాడకట్టంతా సావాలని తెచ్చినవా? ఏయ్ తెచ్చినోన్ని తెచ్చినట్టు తీసుకపో! లేకుంటె నీ ఆటో ఉండది? నువ్వుండవు? ఆగు నేను నా పెనిమిటికి ఫోన్ చేస్తన్న ఆగు. నీ పొసంగం ఏందో.. నువ్వేందో బయటవడ్తది'' అని లొల్లివెట్టుకుంట ఫోన్ కలిపి చెవుకాడ వెట్టుకుంది.

''హల్లో.. మనింటికాడ పీనుగును తెచ్చి ఎత్తుండ్రు నువ్వు జల్దీ రా!'' అని ఫోన్ వెట్టేసింది.

ఆటో డ్రైవరుకు కాళ్లువొయ్యి కడుపుల వడ్డయి.

'లొల్లిల ఎల్లి కాటగలిసినట్లు. ఇదే సందు. అందరొక్కటై కొట్టినా కొడుతరు. ఎందుకొచ్చిన కైలాట్కం' అని అనుకొన్నడు.

''ఎక్కుండ్రి.. ఎక్కుండ్రి'' అని తనతోటి అచ్చినోళ్లను గదిమిండు. వాళ్లు రయ్యాన ఆటోల ఎక్కంగనే, ఆగంల క్లచ్‌వట్టి ఏసిన గేరును లటుక్కున వొదిలిండు డ్రైవర్. ఆటో జట్కిచ్చి, జంపు జేసి, దుంకి గాలిమేగమోలె సిమెంట్ రోడ్డు మీంచి వొచ్చిన తొవ్వెంట మర్రిసూడని పిరికి కుక్కోలే ఒక్క తీర్గ ఉరుక తలిగింది. పొలిమేర దాటి పెద్ద రోడ్డు ఎక్కంగనే.. 'గండంలకెల్లి దాటి బతికితిమిరా' అనుకున్నరు ఆటోల ఉన్నోల్లు.

అక్కడ జమైనోల్లంతా ఫోన్‌ల మీద ఫోన్ కొడ్తనే ఉన్నరు. ఊరు ఊరంత సాకలి మడేల్ వార్త గప్పుమన్నది. ఊరు ఉసికె ఉడికినట్లు ఉడుకుతంది. తలిస్తే మొలిచినట్టు సర్పంచి, ఉప సర్పంచి, వార్డు మెంబర్లు, ఆశ కార్యకర్తలు, సపాయోళ్లు ఒకలెనుక ఒకలు అందరొచ్చిండ్రు. వొత్తనే ఉన్నరు.

''అరేయ్! దూరం నుంచి పిలువుపోరా!'' అని సుంకరి శివయ్యను గెదిమిండు సర్పంచి.

సర్పంచి మాటకు ఎదురు చెప్పలేక అడుగులో అడుగేసుకుంట వొయ్యి, పదిగజాల దూరంల నిలుసున్నడు సుంకరి శివయ్య.

''ఓ.. మడేల్.. మడేల్'' అని పిలిశిండు.

కుయ్యి కుటుక్కు ఏదీలేదు. ఒక్కతీర్గ

''ఊ.. ఊ.. ఊ..'' అని మూలుగుతుండు.

'ఓ' అంటడేమోనని గుంపంతా ఊపిరి బిగపట్టి సూత్తంది. శివయ్య మల్లమల్లా పిలుస్తుండు.

పెయంత ఒణుకుడు. వానకు తడిసిన బక్కెద్దోలె తామూటుగాని వొణుకుడు. మడేల్‌ది బొక్కలోంచి వినవడే మూల్గల రాగమే ఇనవడుతంది.

''అరేయ్ శివ్వా! ఇగవటు దీంతో పొడువు'' అని బ్యాగరి బూమయ్య.. గైకట్టె శేతికిచ్చిండు.

శివయ్య మడేల్ దిక్కు, సర్పంచి దిక్కు సూసిండు. సమజైతలేదు. సర్పంచి 'కానీ.. కానీ' అన్నట్లు బొమ్మలు ఎగిరేసిండు.

'మడేల్' అని అనుకుంట, భయపడుకుంటనే ఈపుల పొడిసిండు. సడిలేదు, సప్పుడు లేదు. దొక్కల పొడుస్తున్నపుడు.. చిన్న కదలిక.

గప్పుడే 'కుయ్యి కుయ్యి.. ఉయ్యి ఉయ్యి' అని పోలీస్ జీప్, అంబులెన్స్ సౌండ్లు ఇనచ్చినయి.

'ఈడికి ఇంతే నయం' అని శివయ్య సాలనుకున్నడు. రయ్యిన ఉరికొచ్చిన పోలీస్ జీప్, బ్రేకులు తొక్కంగనే అడుగుల ఆగింది. టక్కున డోర్ తీసుకొని, కాకిబట్టల కదర్‌తోని టోపి సరిజేసుకుంట దిగిన ఎస్సై.. పెద్దపీరిలా నడిచి వొస్తున్నడు. ఆయన రాకడను గమనించిన సర్పంచి లేసి నిలవడ్డడు.

ఎస్సై ప్రశ్నలు అడుగుతున్నడు. మడేల్ తాలూకు విషయాలు వివరిస్తున్నడు సర్పంచి. వాటిని ఒక్కొకటిగా బుల్లెట్ పాయింట్‌లాగా రాసుకుంటున్నడు స్టేషన్ రైటర్.

అంతల్నే అంబులెన్స్ గూడ అచ్చింది. పీపీఈ కిట్లు ధరించిన ఇద్దరు సిస్టరమ్మలు, ఇద్దరు డాక్టర్లు దిగిండ్రు. వైద్య సరంజామతో మడేల్ దిక్కు నడిశి, ఆయిన పైన బట్టని తీసి సూశిండ్రు. ఎగపోత, దమ్ము, దగ్గు, సలిజరంతో మొస తీయలేక తండ్లాడుతున్నడు. మంచి వైద్యంకోసం మడేల్‌ను సిద్దిపేట ఐసోలేషన్ వార్డుకు తరలిస్తున్నమని చెప్పిండ్రు డాక్టర్లు.

ఎస్సై, సర్పంచి ''సరే'' అన్నరు. వాడకట్టంత ఒక్కసారి ఊపిరి తీసుకున్నట్లయ్యింది.

మడేల్‌ను అంబులెన్స్‌లో ఎక్కించుకున్నరు.

సూత్తుండంగనే అంబులెన్స్ కదిలింది. నిమిషాల్లో తన వేగాన్ని అందుకున్నది. 'ఉయ్యి ఉయ్యి' అనుకుంట ఊరు దాటింది.

మడేల్.. ఐసోలేషన్‌కు తరలిపోయిండు.

''ఆ పేషెంట్ సంబంధీకులు ఎవరున్నరు?'' అని ఎస్సై అడిగితే.. మౌనమే అందరి జవాబైంది.

''కానీ, మడేల్ అన్న కొడుకు కొంరయ్య ఉన్నడు సార్'' అని సాకలి సాయిలు శెప్పిండు.

వెంటనే కొంరయ్యకు సర్పంచి ఫోన్ కలిపిండు. ఫోన్ లౌడ్ స్పీకర్ ఆన్ చేసి..

''బిడ్డా! మీ శిన్నబాపు మడేల్‌ను దావఖానకు తీసుకపోయిండ్రు. మడేల్ సంబంధీకులు ఎవరున్నరని ఎస్సైసాబ్ ఆరా తీస్తే నీకు ఫోన్ జేస్తున్న. రిలేషన్ కింద నీ పేరు రాస్తున్నమంటుండు సార్..'' అని చెప్పిండు.

''సర్పంచ్ సాబ్! సుట్టాలనీ పక్కాలనీ ఏదీ రాయకుండ్రి. సత్తె అనాదశవం కింద సందం శెయ్యిమను. మాకు శిన్నాయిన లేదు. వానికి మేం లేం. ఎన్నడో వోయిండు. మాకూ ఆనికీ ఏం లేదు'' అని కొంరయ్య కట్టిరిసినట్లు శెప్పిండు.

డాక్టర్ సిద్దెంకి యాదగిరి



డాక్టర్ సిద్దెంకి యాదగిరి స్వస్థలం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనేపల్లి. వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయులు. సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో పీజీ చేశారు. 'తెలంగాణ పాటల్లో సామాజిక చిత్రణ'పై పరిశోధనకు ఓయూ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకొన్నారు. 1998 నుంచీ రచనా వ్యాసంగంలో ఉన్నారు. తొలి కథ 'బోధ' సాహిత్య ప్రస్థానంలో ప్రచురితమైంది. ఇప్పటి వరకూ 35 కథలు, మరెన్నో కవితలు రాశారు. 2008లో 'మా తొవ్వ', 2014లో 'బతుకు పాఠం' కవితా సంపుటాలను, 2016లో 'తప్ష' కథా సంపుటి, 2020లో 'అచ్చు' కవిత్వ సంపుటిని వెలువరించారు. 2014లో ఉత్తమ కథా పురస్కారం దక్కించుకున్నారు. వివిధ దిన, మాస పత్రికలు నిర్వహించిన కవితలు, కథల పోటీల్లో బహుమతులు పొందారు. 2018లో వేముగంటి సాహిత్య పురస్కారం, ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక పోటీల్లో బహుమతి అందుకున్నారు. డా. కాలువ మల్లయ్య సప్తతి పురస్కారం దక్కించుకున్నారు. వృత్తిపరంగా 2019లో సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకొన్నారు. 'జంబూ సాహితి'ని స్థాపించి, సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

***

డాక్టర్ కత్తి మల్లయ్య పర్యవేక్షణలో సిద్దిపేట ఐసోలేషన్ వార్డులో తన సిబ్బందితో కలిసి కరోనా రోగులకు చికిత్స చేస్తున్నరు. వారందరినీ కంటికి రెప్పలా చూస్తడు డాక్టర్ మల్లయ్య. ఆఖరి ఘడియల్లో ఉన్న అనేక మందిని బతికించిండు. 'సావ వోయే యాల్ల కత్తి మల్లయ్య సార్ సేతులపడితే సాలు బతుకుతం' అనే పేరువోయింది.

కరోనా పేషెంట్లు కొత్తవాళ్లు వస్తనే ఉన్నరు. కోలుకున్నోళ్లు డిశ్చార్జ్ అయి పోతనే ఉన్నరు. పదిహేను రోజుల తర్వాత మడేల్ కోలుకున్నడు. టెస్టులో నెగెటివ్ వచ్చింది. మంచిగైండు. అతన్ని డిశ్చార్జ్ చేస్తుండ్రు. డిశ్చార్జ్ లిస్టు చూస్తున్న కత్తి మల్లయ్య సార్‌కు మడేల్ పేరు కనవడ్డది.

వెంటనే మడేల్ బెడ్ దగ్గరికి వోయిండు.

''మడేల్! పానం ఎట్లున్నది?'' అడిగిండు.

''ఆ.. మంచిగనే ఉన్నది సార్! మీరిచ్చిన పానం. సచ్చినా పీడవోవు. ఎందుకు బతికిచ్చిండ్రు. పిల్లలోన్నా. ఉన్నా.. ఒక్కన్ని, పోయినా.. ఒక్కన్ని'' విరక్తితో జవాబిచ్చిండు మడేల్.

''ఇచ్చిన దేవుడు కొంటవోయిన్నాడు ఏ డాక్టర్ ఆపడు. ఇప్పుడెట్లుందో శెప్పరాదూ?'' డాక్టర్ ప్రశ్నిస్తూ, కేస్‌షీట్ చూస్తూ మల్లా అడిగిండు..

''ఏ ఊరు మీది? నీ గురించి శెప్పు?'' అని.

''నాకో ఊరున్నాది? నాకో సంసారమున్నాది? ఏ ఊరని శెప్పొత్తది బాంచెన్? పుట్టి పెరిగింది గోనెపల్లిల. ఇదే సిద్దిపాట్ల బట్టలుతుక్కుంట బతికిన. నా ముసల్ది వోయింది.. నా బతుకు ఆగమైంది'' అని శెప్పుతాండు.

''ఏ పెద్దమనిషి! ఊళ్లకేలి ఎట్లెల్లినవు? నీ గతం శెప్పు?'' అని అడిగిండు డాక్టర్ మల్లయ్య.

''అది కీలకనామ సంవత్సరం. కానోడు కరువుల సత్తడన్నట్లు మా దండి కరువు. ఆకులు అలములు తిని బతుకుతున్న యాల్ల. శాతల దినం. మాదిగోల్లు కూడా మాకు ఆసాములే. మాదుగులకు మేం బట్టలుతుకుతున్నం. కరువుకాలంల మంగలోల్లు బతకలేక, శాలోల్లతోటి బీవండికి వోయిండ్రు. ఊల్లె మంగలోల్లు లేరు. దాంతోని మంత్రసాని పనిని గూడ మమ్ముల్నే శెయ్యిమన్నరు. కరువుకు పొట్టకు, బట్టకు బతుకుడే కట్టమని కాదనక మేం ఒప్పుకున్నం. అట్లే చేస్తున్నం.


గుడ్ల రామని కొడుకులకు ఏడుగురు. వాళ్ల తాతకు తురక జాగీరోడు ఇరువై ఎకురాల ఇనాం జాగిచ్చిండు. అళ్లు ఎవనికి ఆశవడక బతుకుతుండ్రు. మాదిగోడు గెట్టుపక్కకు ఆనుకొని ఉండుడు కాపోల్లకు కండ్లు మండింది.

రాజయ్య పెద్దకొడుకు బూమయ్యకు మా ఊరి పెద్దకాపుతోటి గెట్టుకాడ మాట బెణికింది. తిట్టుకున్నరు. కొట్టుకున్నరు. తీటది ఉన్నకాడ నిత్తె కయ్యమన్నట్లు ఊకె జవుడాలు అయినయి. కాపోల్లకు, దొరలకు సోపతి. దొరల బిర్రు సూసుకొని కాపోడు తాపతాపకు మాదిగోల్ల మీద కాలుదువ్వుతుండు.

ఉషారు పిట్ట బూమయ్య. నమ్మిచ్చి మొసమర్ర కుంట గుద్దినట్లు సూసి సూసి పోలీస్ టౌన్ల కేసు వెట్టిండు. కాపోల్లు దక్కన్న దేశం దిరిగిండ్రు. కాపోల్లకంటే ఎక్కువ.. దొరల ఇజ్జతి వోయింది. దాంతోని ఆళ్లమీద కక్ష కట్టిండ్రు దొరలు.

ఊరి మాదిగోల్లను పిల్సి.. 'రామనితోటి

'ఆడిదాని కట్టం ఆడిదానికెరుక. నీకేమెరుక? నువ్ నొప్పుల్దీసి కంటె అనపోదువు. నేను కాన్పు చేసెతం దుకు వోతన్న. వొద్దన్నవనుకో మర్యాద ఉండది' అని తెగాంచి, నా భార్య మల్లవ్వ, బూమయ్య భార్య ఇద్దరూ కలిసి దమ్ముపట్ట మాదిగిండ్లకు ఉరికిండ్రు.



ఉంటరా? మాతోటి ఉంటరా?' అని అడిగిండ్రు.

'నువ్వెట్ల జెప్తే గట్లనే దొరా!' అని పెద్దదొరకు శెప్పిండ్రు. పెద్దొర ఆనతి మీదికెళ్లి, మాద్గులందరూ ఏకమై రామయ్యకు కులం బందు వెట్టిచ్చిండ్రు. ఊరుమొత్తం కట్‌బంద్ అయిండ్రు. ఊళ్లె ఉప్పురాళ్లు కాదుకదా అగ్గిగూడ వుట్టకుంట సేసిండ్రు. ఇంకొాగలైతే ఉరివెట్టుకొని సచ్చేటట్టు చేసిండ్రు. అయినా రామయ్య కొడుకులు బయపల్లే. గప్పుడే బూమయ్య తమ్ముని పెండ్లాం నీళ్లు వోసుకున్నది'' అంటూ.. మడేల్ శెప్పుకుంట వోతాంటే, డాక్టర్ కత్తి మల్లయ్య 'ఊ' కొడుతుండు.

''మా ఊల్లె మంగలోల్లు లేరు కదా! నా పెండ్లాం మంత్రసాని పనిసేతంది..ఇగ మేం జేసిన తప్పేందంటే.. రామయ్య కోడలు లస్మి నీల్లాడెతందుకుండె. ఆపతివడి తండ్లాడుతాంది. అయినా మేం పోవొద్దని దీర సేసుకున్నం''.

లస్మి పేరెత్తంగనే.. మల్లయ్య డాక్టర్‌కు మనసు కూలిన పాతగోడల్ని పెకిలించినట్లయ్యింది.

''రోజులు గట్ల గడుత్తుండగనే.. ఓనాడు బూమయ్య పెండ్లమొచ్చి నా పెండ్లాం కాల్లమీద వడ్డది. 'మల్లక్కా! నీ బాంచన్. మా యారాలు లస్మి ఆపతివడుతూ సావుబతుకుల నడ్మ కొట్టుకాడుతాంది. ఆడిదాని ఆపతి ఆడిదానికెరుక అక్కా! మా లస్మిని నువ్వే బతికించాలె అక్కా!' అనుకుంట, ఒక్క తరీక ఏడుస్తాంది. నా పెండ్లాం కర్పూరమోలే కరిగిపోయింది.

వెంటనే కొనకొంగు తీసుకొని.. 'ఓ పోరీ! ఎందుకేడుత్తున్నవే? ఊకో జర ససు' అని ఊకుంచుకుంట, ధైర్నం మాటలు శెప్పింది.

'దిక్కు లేనోల్లకు దేవుడే దిక్కు. ఎవడాగవడు తడో నేనొత్త పా. మనిషి సావంగ సూత్తారు?' అని ఊకుంచింది. కానుపు చేసేతందుకు బైలెల్లుతుంటె.. నేను 'వొద్దొద్దు' అని శెప్పిన.

'ఆడిదాని కట్టం ఆడిదానికెరుక. నీకేమెరుక? నువ్ నొప్పుల్దీసి కంటె అనపోదువు. నేను కాన్పు చేసెతందుకు వోతన్న. వొద్దన్నవనుకో మర్యాద ఉండది' అని తెగాంచి, నా భార్య మల్లవ్వ, బూమయ్య భార్య ఇద్దరూ కలిసి దమ్ముపట్ట మాదిగిండ్లకు ఉరికిండ్రు. కానుపు జేసిండ్రు. సీకట్ల సెంద్రదీపమోలె మొగపిలగాడు పుట్టిండు''.

డాక్టర్‌కు మనసులో ఏదో అలజడి మొదలైంది. అది తనదా? తన వృత్తిదా? అర్థమైతలేదు.

మడేల్ శెప్పుకుంట వోతనే ఉన్నడు..

''కానీ, మా బతుకుల్ల సీకటి అలుముకుంది. మమ్ముల ఊరంత పగవట్టింది. మాకు కులం బందు వెట్టిండ్రు. ఎలేసిండ్రు. పుల్కాషులమైన మమ్ముల సూసి రామయ్య కొడుకులు బాధవడ్డరు. 'ఎలేసినోల్లం ఒక్క దగ్గరుందాం రాండ్రి. చేసుక బతుక ఎకురం భూమి ఇస్తం' అని ఆగయ్య, బూమయ్య పిలిసిండ్రు. మాకే మనసొప్పలే. మేం పోలే. ఊరు గొడ్డువోతే దేశం గొడ్డువోతదా? ఈడ కాకపోతే ఇందూర్ల బతుకుతమని ముల్లె మూట సదురుకొని సిద్దిపాట జేరినం.

ఈ సందుల.. మన్నో మసాడమో తగిలి ఉన్న కొడుకు నవిసిండు. కొన్నిదినాలకు గిసొంటిదే ఓ పెద్దరోగంల ఉన్నొక్క మెతుకు గంజిల వోయింది. నా కొడుకు సచ్చిపోయిండు'' అనుకుంట పక్కన పలిగి, ఏడిసిండు మడేల్.

సుట్టూ శేరినోళ్ల కండ్లూ శెమ్మగిల్లినయి. డాక్టర్ కత్తి మల్లయ్య కూడా ఏడుస్తున్నడు.

మడేల్ సెప్పుతుంటే.. డాక్లర్ కత్తి మల్లయ్యకు తన తల్లి ఎప్పుడూ గురుతు చేసే సాకలితల్లి మల్లవ్వ లీలగా గురుతుకొస్తున్నది. ''శెప్పు శెప్పు'' అని మల్లమల్ల అడుగుతుండు.

''ఆగయ్య కొడుక్కు నా పెండ్లాం పేరే పెట్టుకున్నరట.. 'మల్లయ్య' అని. కొన్నొద్దులకు నా పెండ్లాం బాగా లేకుంటైంది. ఇంకొన్ని దినాలకు నన్ను అడివిల కాటగలిపి ఆవలవడ్డది. దానితోటే సుట్టాలు పక్కాలు అందరూ పోయిండ్రు. నా సావు గోనెపల్లిల కావాలని వోయిన గంతే! ఇగో గిదంత జరిగింది'' అని ముగించిండు మడేల్.

కత్తి మల్లయ్య డాక్టర్ కండ్లు మూసుకున్నడు. మనసు కలుక్కుమన్నది. బాల్యమంతా సినిమా రీల్‌లా కనవడుతాంది. 'మల్లక్క సేవజేసి నిన్ను బతికిచ్చిన దేవత. నువ్వు పుట్టితందుకు ఊరిడిసింది. మల్లక్కలెక్క నువ్వు వైదుగం శెయ్యాలె. పుట్టవోయెటోల్ల బతికించాలె' అని తల్లి సెప్పిన మాటలు.. శెవుల నిండా ప్రతిధ్వనిస్తున్నయి. పీపీఈ కిట్‌లో ఉన్న డాక్టర్ కత్తి మల్లయ్య వొంగి మడేల్ కాళ్లకు దండం వెట్టిండు.

''బాపూ! నేనే ఆనాటి శిశువును. నేనే ఆగయ్య కొడుకును. మా తల్లే లస్మవ్వ. మా తల్లికి కాన్పుచేసింది మల్లవ్వనే. 'నన్నూ, నిన్నూ బతికించింది సాకలి మల్లక్కనే' అని శెప్పేది మా అమ్మ. 'ఆమె పేరే నీకు పెట్టిన బిడ్డా!' అని మురిసిపోయేది. నీకు ఎవ్వల్లేరనకు బాపూ! నేనున్న. ఇయ్యాల్టి సంది నువ్వు మాతోనే ఉండు'' అని బొంగు వోయిన గొంతుతో అంటున్న డాక్టర్‌కు.. పిడికెడు గుండెలో దాగిన దుఃఖం సునామిలా పొంగింది. మడేల్ పొగిలి పొగిలి ఏడుస్తుండు. అవ్వి కన్నీళ్లు కాదు.. ఆనంద బాష్పాలు. తన భార్యకు ఫోన్‌చేసి బాపు కాని బాపు మడేల్‌ను పంపిస్తున్న అని శెప్పిండు.

'నియ్యతి నీళ్లల్ల ఏసినా చెడది అంటే గిదే. చేసిన మంచి అటు దిరిగి, ఇటు దిరిగి మంచే జరిగిస్తది' అని గుసగుసలు పెట్టుకుంటుండ్రు నర్సులు. కరోనా పేషెంట్లతో వ్యాన్ రాంగనే.. బెల్లం దగ్గరికి ఈగెలురికినట్టు ఉరికిండ్రు డ్యూటీలకు! ■